క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి


వీరభద్రరావు (పాతచిత్రం)

సామర్లకోట: వీకే రాయపురం గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ బదిరెడ్డి వీరభద్రరావు (65) బుధవారం మృతి చెందారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడి పని చేశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. వీరభద్రరావు మృతికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, నాయకులు తలారి దొరబాబు, ఇంటి వెంకట్రావు, వెలమర్తి బుల్లిరాజు, వెలమర్తి శ్రీనివాసు తదితరులు సంతాపం తెలిపారు.

కరపత్రం ఆవిష్కరణ

కొత్తపల్లి: పొన్నాడలో ఉన్న బషీర్‌బీబీ(బంగారు పాప) దర్గా వద్ద గురువారం ఉర్సు ఉత్సవాలకు సంబంధించి కరపత్రాన్ని స్థానిక ముజావర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ 69వ ఉర్సు ఉత్సవాలు ఫిబ్రవరి 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు షేక్ ఇమామ్ వలీ, షేక్ పీర్ మహమ్మద్, షేక్ నాథల్లీ భాషా, షేక్ బడే సాహెబ్‌లు తెలిపారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

పెద్దాపురం: రాష్ట్రంలో కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని పెద్దాపురం భవన నిర్మాణ కార్మిక సంఘం గురువారం పెద్దాపురం ఆర్డీఓ జేఎస్‌రామారావుకు వినతి పత్రం అందించింది. సంఘ సభ్యులు గడిగట్ల సత్తిబాబు, చింతల సత్యనారాయణ, తైనాల శ్రీను, వడ్డి సత్యనారాయణ, గంగ, రమణ తదితరులున్నారు.

పట్టుదలతో విజయతీరానికి..


చందన

పెద్దాపురం: పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదని పెద్దాపురం మండలం మర్లావ గ్రామానికి చెందిన యువతి వేమన చందన నిరూపించింది. ఇటీవల విడుదలైన ఎస్‌ఐ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జోన్ టూ కేటగిరీలో మహిళా ఎస్‌ఐగా ఉద్యోగం సాధించింది. ఆమె తండ్రి రామచంద్రరావు తపాలా శాఖలో పోస్టుమాస్టర్ కాగా, తల్లి శ్రీలక్ష్మి గృహిణి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను ఈ ఘనత సాధించానని చందన తెలిపింది.

ఆశయాలు నెరవేర్చేందుకు కృషి


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అవినాష్

పెద్దాపురం: విద్యా దాత బచ్చు కోటేశ్వరరావు ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని బచ్చు ఫౌండేషన్ వారసుడు బచ్చు అవినాష్ దేవిచంద్ర అన్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ ట్రస్ట్ బోర్డు సమావేశం గురువారం ఫౌండేషన్ మేనేజింగ్ చైర్మన్ బచ్చు అవినాష్ దేవిచంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ సేవలను ఏపీలోనే కాకుండా దేశ వ్యాప్తంగా అందించాలనే ఉద్దేశంతో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. తొలుత నూతన ట్రస్టీలుగా ఎం.వరలక్ష్మి, కె.లక్ష్మితాయారు, జి.సత్తిబాబు, ఎ.శ్రీను, జె.కిషోర్, జి.వీరాస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఫౌండేషన్‌కు సంబంధించిన సావనీర్‌ను ఆయన ఆవిష్కరించారు.

అలరించిన నృత్యాలు

పిఠాపురం: జములపల్లిలో గురువారం రాత్రి నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. వేడుకల్లో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను కట్టిపడేశాయి. స్థానిక బర్నింగ్‌టూల్స్ మినిస్ట్రీస్ డైరెక్టర్ కె.ఎలీషా ఆధ్వర్యంలో పాస్టర్ జాన్ పాల్ పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

పెద్దాపురం: పట్టణంలో అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ అధిక ప్రాధాన్యం ఇస్తుందని పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అన్నారు. స్థానిక ఐదో వార్డులో సీసీ రోడ్డుకు గురువారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం వార్డు కౌన్సిలర్ విడదాసరి రాజా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాయిప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

సారా కేసులో జరిమానా

సామర్లకోట: అనేక పర్యాయాలు సారాతో పట్టుబడిన నురుకుర్తి వెంకటలక్ష్మిని సామర్లకోట తహసీల్దార్ కుమారి ఎదుట హాజరుపరిచి రూ.25 వేల జరిమానా వసూలు చేశామని కాకినాడ ఎక్సైజ్ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.రామ్మోహనరావు గురువారం రాత్రి తెలిపారు. మాధవపట్నంలో సారాతో వెంకటలక్ష్మి పట్టుపడటంతో తహసీల్దార్ వద్ద హాజరుపర్చి బైండోవర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అంగన్‌వాడీల ధర్నా

సామర్లకోట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేశారు. తమ సమ్మెలో భాగంగా పోస్టు కార్డు ఉద్యమం నిర్వహిస్తున్నామని అంగన్‌వాడీల సంఘ అధ్యక్షురాలు ఎ.అమలావతి తెలిపారు.

పోనివ్వవు.. ఎక్కడా ఆగనివ్వవు

- కుక్కల దాడితో జనం బెంబేలు
- సామర్లకోట నియోజకవర్గంలో దుస్థితి


సామర్లకోట స్టేట్ బ్యాంకు వద్ద గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

సామర్లకోట: గ్రామ సింహాలు గర్జిస్తున్నాయి.. ఎక్కడ చూసినా గుంపులు, గుంపులుగా సంచరిస్తున్నాయి. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. సామర్లకోట మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని 18 గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. ఇటీవల కాలంలో పరిస్థితి మరింత చేయిదాటింది. సామర్లకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం ఆరు నుంచి ఏడుగురు, మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 8 నుంచి 10 మంది కుక్కకాటు బాధితులు వస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ జనం వెంటబడి దాడి చేస్తున్నాయి. కుక్కకాటుకు గురైన వారు తప్పనిసరిగా ఐఆర్‌వీ వ్యాక్సిన్ వేయించుకోవాలని వైద్యులు చెబుతున్నారు. కుక్కకాటు తీవ్రతను బట్టి నాలుగు నుంచి ఐదు ఇంజక్షన్లు చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ సమయంలో ఆహార నియమాలు పాటించాలి.

శస్త్రచికిత్సలకు నిర్ణయించి..

కుక్కల సమస్యను పరిష్కరించాలని ప్రతి కౌన్సిల్ సమావేశంలో సభ్యులు చెబుతున్నారు. అయితే కుక్కలను సంహరిస్తే కోర్టులో కేసులను ఎదుర్కోవాల్సి వస్తుందని మున్సిపల్ అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో కుక్కల సంతతి పెరగకుండా ఇటీవల మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కమిషనర్, పశుసంవర్ధక శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పట్టణంలోని వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసే కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు దానికి అయ్యే ఖర్చును మున్సిపాలిటీ భరించాలని భావించారు. దీనిని అమలు చేసి కౌన్సిల్ తీర్మానం చేసే సమయంలో కమిషనర్ బదిలీపై వెళ్లిపోవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చిందని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సామర్లకోట పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో కుక్కలకు ఆపరేషన్లు చేయడానికి అవసరమైన షెడ్లు ఉన్నాయి. అక్కడ ఆపరేషన్లకు ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



సామర్లకోటలో కుక్కలు పెరిగిపోయాయి. చిన్న పిల్లలను రోడ్లపైకి పంపడానికి భయపడుతున్నాం. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాలి.

–రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ వైఎస్సార్ యువసేన జిల్లా కార్యదర్శి, సామర్లకోట

అందుబాటులో వ్యాక్సిన్



కుక్క కాటుకు గురైన వెంటనే నీటితో గాయాన్ని శుభ్రం చేయాలి. వెంటనే సమీపంలో ఉన్న ఆసుపత్రికి రావాలి. ప్రభుత్వ ఆసుపత్రిల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. రోజూ ఐదు నుంచి ఆరుగురు కుక్క కాటుకు గురవుతున్నారు. వీరికి నాలుగు నుంచి ఐదు వ్యాక్సిన్లు వేయాల్సి ఉంటుంది.

–అమల, డాక్టర్, సామాజిక ఆరోగ్య కేంద్రం, సామర్లకోట

శుభదినం.. క్రీస్తు జననం


క్రిస్మస్ ఆరాధనలో ప్రసంగిస్తున్న శామ్యూల్ సుదీప్

పెద్దాపురం: క్రీస్తు జననం యావత్ ప్రపంచానికి శుభదినమని ఉజ్జీవ ప్రసంగీకుడు జి.మధుకిరణ్, క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం అన్నారు. కాండ్రకోట క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మందిర నిర్వాహకుడు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన క్రిస్మస్ వేడుకల్లో వారు ప్రసంగిస్తూ క్రిస్మస్ అంటే క్రీస్తును ఆరాధించడమేనన్నారు. ప్రతి వ్యక్తి క్రీస్తు బోధనలను ఆచరించాలని దైవజనులు కె.అభిషేక్, కె.జయకుమార్ అన్నారు. అనంతరం చిన్నారుల క్రిస్మస్ తాత వేషధారణలు, క్రైస్తవ గీతాలాపనలు అలరించాయి. అనంతరం భారీ కేక్‌ను నంగిన సత్యానందం, శాంతకుమారి దంపతులు కట్ చేశారు. శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, పాస్టర్లు నంగిన ప్రేమలత, విశాల, బొందల త్రిమూర్తులు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉంటాం

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి


సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

పెద్దాపురం: విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు అన్నివిధాలా అండగా ఉంటామని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, కళ దంపతులు అన్నారు. గురువారం పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో దివ్యాంగులకు అవసరమైన మంచాలను శాంతివర్ధన మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు రాయవరపు వీరబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా దొరబాబు, కళ దంపతులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన పెంపొందించుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతులకు సేవలందిస్తున్న వీరబాబు, సత్యలను వారు అభినందించారు. తమవంతు సాయంగా విద్యార్థులకు ఈ మంచాలను సమకూర్చామన్నారు. వీరికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందజేస్తుందన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవస్థాపకుడు వీరబాబు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తుంటే, ఇచ్చిన మాట నెరవేర్చి ఆయన అడుగుజాడలో నడుస్తున్న వ్యక్తి దవులూరి దొరబాబు అని అన్నారు. విభిన్న ప్రతిభావంతుల అవసరాన్ని గుర్తించి సేవలందించిన దొరబాబు, కళ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలసి దొరబాబు విద్యార్థులకు మంచాలను అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళీ, బోనాసు గుర్రాజు, సుందరెడ్డి రాజు, లక్కాకుల కృష్ణ, గోరగట్ల నాగేశ్వరరావు, పాఠశాల ఏఓ వేణు, శాంతివర్ధన్, చంటి, అప్పలరాజు, బుజ్జి, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు వరి నాట్లు పూర్తి చేయాలి

జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయకుమార్


రాపర్తిలో వరినాట్లు వేసిన పొలంలో రైతుకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయకుమార్

పిఠాపురం: ఇక నారు మళ్లు వేయడం ఆపేసి, వెదజల్లే పద్ధతుల్లోనే నాట్లు వేసి ఈనెలాఖరు నాటికి సాగు పనులు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.విజయకుమార్ రైతులకు సూచించారు. ఆయన రాపర్తి తదితర గ్రామాల్లో గురువారం వరి నాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఇప్పటికే ఆలస్యమైనందున వరి నారుమడులు వేయవద్దన్నారు. కేవలం వెదజల్లే పద్ధతుల్లో మాత్రమే వరి నాట్లు వేయాలని, అవి కూడా ఈనెలాఖరుకు కచ్చితంగా పూర్తి చేసుకునేలా చూసుకోవాలని ఆయన సూచించారు. మండలంలో ఎంత వరకూ నాట్లు పూర్తయ్యాయి ఇంకా ఎంత పూర్తి కావాలి అనే విషయాలను స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను అడిగితెలుసుకున్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల గొడౌన్లను పరిశీలించిన ఆయన ఆర్బీకే పరిధిలో పంపిణీ చేస్తున్న ఎరువుల వివరాలు తెలుసుకున్నారు. వరి నాట్లు పూర్తి చేసిన రైతులకు సంబంధించి పంట నమోదు వివరాలు ఈకేఈవై వెంటనే పూర్తి చేయాలని రైతు భరోసా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. ఈయన వెంట పిఠాపురం వ్యవసాయ శాఖ ఏడీఏ పి.స్వాతి, వ్యవసాయ శాఖ అధికారి అచ్యుతారావు వీఏఏలు పి.సుధారాణి, ఆర్.రాజు, పలువురు రైతులు, ఆర్బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ వృత్తి ఎంతో గౌరవప్రదం


జిల్లా కమిటీ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: సమాజంలో ఫొటోగ్రఫీ వృత్తి ఎంతో గౌరవప్రదమని, సభ్యులందరూ కలిసికట్టుగా ఉండాలని జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తోట సూర్యసుబ్బారావు అన్నారు. పొన్నాడ శివారు బషీర్‌బీబీ(బంగారుపాప) దర్గా సమీపంలో గురువారం మండల ఫొటో, వీడియో అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటో, వీడియో గ్రఫీ వృత్తి ఎంతో గౌరవ ప్రథమైనదన్నారు. అందరూ కలిసి కట్టుగా ఉంటేనే ఏదైనా సాధించగలమని అన్నారు. జిల్లాలో 24 మండలాల్లో యూనియన్లు ఉండగా సుమారు 1500 మంది సభ్యులున్నారన్నారు. ఏ ఫొటోగ్రాఫరైన ప్రమాదానికి గురైనా, మృతి చెందినా, అనారోగ్యంతో బాధపడుతున్నా ఆ కుటుంబానికి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు తెలిపారు. మండల యూనియన్ అధ్యక్షుడు కామేశ్వరావు, సెక్రటరీ పుచ్చల బంగారు బాబు, ట్రెజరర్ షరక్ బాబు, జిల్లా ట్రెజరర్ పేపకాయల వీరభద్రరావు జిల్లా గౌరవ అధ్యక్షుడు పొన్నగంటి శ్రీను, జిల్లా కమిటీ సభ్యుడు పిట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా..


సామర్లకోటలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

సామర్లకోట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు పట్టణ, మండల పరిధిలో ఉత్సాహంగా జరుగుతున్నాయి. సామర్లకోటలో 15 సచివాలయాలకు సంబంధించి క్రీడా పోటీలను ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. మూడో రోజు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. మండలంలోని 18 గ్రామాలకు సంబంధించి ఆయా సచివాలయాల సమీపంలోని పాఠశాలల్లో క్రీడలు జరుగుతున్నాయి. సచివాలయాల పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను మండల స్థాయికి ఎంపిక చేస్తున్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి మంచి వేదికగా 'ఆడుదాం ఆంధ్ర' దోహదపడుతుందని మూడో రోజు క్రీడలను పర్యవేక్షించిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ అన్నారు. ఈ నెల 26న ప్రారంభమైన సచివాలయ స్థాయి పోటీలు జనవరి 9 వరకు జరుగుతాయన్నారు. అలాగే అన్ని స్థాయిల్లో విజేతలకు బహుమతులు అందిస్తారన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు


పి.దొంతమూరులో వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రజా సంక్షమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వం గ్రామాభివృద్ధే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఆయన గురువారం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన పిఠాపురం మండలం జగపతిరాజపురం నుంచి గోకివాడ, జములపల్లి, నరసింగపురం మీదుగా పిఠాపురం వరకూ రూ.1.90 కోట్లతో నిర్మించనున్న మెయిన్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పిఠాపురం మండలం రాపర్తిలో జల జీవన్ మిషన్ నిధులు రూ.1.07 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రాయవరంలో రూ.43.60 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. పిఠాపురం మండలం పి.తిమ్మాపురంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లను, వాటర్ ట్యాంకును ఆయన ప్రారంభించారు. రూ.43.60 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. వెల్దుర్తిలో జల జీవన్ మిషన్ నిధులు రూ.52.70 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులకు, వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెంలో రూ 22.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్‌హెల్త్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. పిఠాపురం మండలం పి.దొంతమూరులో జల జీవన్ మిషన్ నిధులు రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన ఇంటింటికి కుళాయి కనెక్షన్‌లను, వాటర్ ట్యాంకును ఆయన ప్రారంభించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు నుంచి ఏపీ నగరం వెళ్లె రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సంక్షేమ ఫలాలు అందరికీ సమానంగా అందించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే ముందున్నారన్నారు. ఆయన ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న ప్రతి పథకం ప్రతి పేదవారికి చేయూతగా మారి వారికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, గొల్లప్రోలు జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు జవ్వాది నాయుడు, అరిగెల రామయ్యదొర, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నడిగట్ల చింతలరావు, వైఎస్సార్ సీపీ నేతలు మొగలి బాబ్జి, కొత్తపల్లి రమణ బాబ్జి, ఉలవల భూషణం, కడింశెట్టి భాస్కరరెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పార్టీ అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి గ్రామాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

కొత్తపల్లి: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండో విడత కార్యక్రమం జనవరి 5వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వెంకట నారాయణ గురువారం తెలిపారు. 5న ఉప్పాడ సచివాలయం-3, 9న మూలపేట, 23న కొత్తపల్లి, 30న కొండెవరం సచివాలయం-2 సురక్ష కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. ఫిబ్రవరి 6న అమీనాబాదు సచివాలయం-2, 16న కొమరగిరి-2, 23న ఇసుకపల్లి, 27న రమణక్కపేట, మార్చి 3న ఉప్పాడ సచివాలయం-1, 12న నాగులాపల్లి- 2, 19న కొండెవరం సచివాలయం-1, 30న ఉప్పాడ సచివాలయం-2లో సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఏప్రిల్ 6న ఉప్పాడ సచివాలయం-4, 16న ఎండపల్లి సచివాలయం-1, 23న శ్రీరాంపురం, 30న ఎండపల్లి సచివాలయం-2, మే 7న పొన్నాడ సచివాలయం-2, 17న పొన్నాడ సచివాలయం-1, 21న కుతుకుడుమిల్లి, 28న గోర్స, జూన్ 7న అమీనాబాదు సచివాలయం-1, 14న కొత్త మూలపేటలో కార్యక్రమాలను ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

అందరికీ ఉపాధి కల్పించాలి


ఉపాధి హామీ మేట్ల శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్తిబాబు

సామర్లకోట: ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డులు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఉపాధి హామీ మేట్లకు రెండు రోజుల శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పనిని బట్టి వేతనం అందిస్తామని, దీనిపై కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. కొంత మంది కూలీలు పని చేయకుండా గట్లపై కూర్చోవడంతో పనిచేసే వారికి కూలి పోతుందని, ఆ విషయం అందరికీ తెలియజేయాలన్నారు. ఎంపీడీఓ డి.శ్రీలలిత మాట్లాడుతూ మస్తరులో అవకతవకలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని సూచించారు. ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగాలి


పెద్దాపురం ఆర్డీఓను మర్యాద పూర్వకంగా కలసిన క్లాస్-4 ఉద్యోగులు

పెద్దాపురం: ప్రభుత్వ ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగాలని పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానికంగా గురువారం డివిజన్ పరిధిలో క్లాస్-4 ఉద్యోగుల సర్వసభ్య సమావేశం అడహాక్ కమిటీ చైర్మన్ సవరపు చినఅప్పారావు అధ్యక్షతన జరిగింది. అనంతరం డివిజన్ స్థాయి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోగా క్లాస్ ఫోర్ ఉద్యోగులు పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావును మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు తమ వంతు సహాయ, సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ప్రభుత్వ పరంగా పరిష్కరించుకోవాల్సిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత కార్యవర్గ సమావేశానికి ఏపీ రెవెన్యూ సర్వీసెస్ కమిటీ అసోసియేషన్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు ఎంవీవీ భానుకుమార్ ముఖ్య అతిథిగా హాజరుకాగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఎం.విజయ్‌కుమార్ (రెవెన్యూ), కార్యదర్శిగా ఎం.వెంకటరమణ (సేల్స్‌ట్యాక్స్), ఉపాధ్యక్షులుగా వి.రాంబాబు (పంచాయతీరాజ్), పి.శ్రీనివాస్ (ఇరిగేషన్), అసోసియేట్ అధ్యక్షులుగా పి.రామారావు (రిజిస్ట్రేషన్), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సీహెచ్ భద్రరావు (రెవెన్యూ), సహాయ కార్యదర్శులుగా ఎం.రామారావు (సాంఘిక సంక్షేమ శాఖ), కె.అప్పారావు (ఐసీడీఎస్), కార్యవర్గ సభ్యులుగా సీహెచ్ బుల్లయ్యదొర (సర్వే), బి.గణేశ్వరరావు (రెవెన్యూ), కె.వరలక్ష్మి (పంచాయతీరాజ్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీని పలువురు అభినందించారు.

ధ్వంసమైన ఇళ్లను పరిశీలించిన ఆర్డీఓ


దుండగులు కూల్చేసిన గృహాలు, దుకాణాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ కిషోర్

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మంగళవారం అర్ధరాత్రి కొందరు గుర్తుతెలియని దుండగుల దాడిలో ధ్వంసమైన నివాస గృహాలు, దుకాణాలను గురువారం కాకినాడ ఆర్డీఓ కిషోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ యంత్రాలతో వచ్చిన దుండగులు విచక్షణారహితంగా దాడి చేసి గృహాలను దుకాణాలను కూల్చి వేయడంతో పాటు గృహాల్లో ఉన్న తమను తాళ్లతో బంధించి దాడికి తెగబడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఫిర్యాదు చేసినా పోలీసులు సరిగా స్పందించడం లేదని దాడికి దిగిన వారు పట్టపగలే ఇక్కడ తిరుగుతున్నా వారిపై చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆరోపించారు. ఇంత దారుణంగా రౌడీజం చేసి దర్జాగా రోడ్లపై తిరుగుతుంటే పోలీసులు కనీసం పట్టించుకోక పోగా తమ వారిపై తిరిగి కేసులు పెడుతున్నారని వారు ఆర్డీఓకు వివరించారు. తమ నివాసాలపై సుమారు 50 మంది వ్యక్తులు మారణాయుదాలతో దాడికి దిగారని తమ వెంట తీసుకువచ్చిన యంత్రాలతో ఇళ్లను కూల్చి వేయడంతో పాటు అడ్డుకున్న తమపై దాడికి పాల్పడ్డారని తమ వద్ద ఉన్న సెల్ ఫోన్లను లాక్కోవడంతో పాటు బయటకు వెళ్లకుండా బంధించి ఇళ్లను దుకాణాలను కూల్చి వేశారని బాధితులు ఆర్డీఓకు వివరించారు. తమపై దాడి జరుగుతున్న సమయంలో 100 కాల్ చేసినా స్పందన లేదని ఎప్పుడు తిరిగే పెట్రోలింగ్ వాహనం కూడా రాలేదని, దాడి జరుగుతున్న సమయంలో కరెంట్ సైతం తీసేశారని ఆర్డీఓ దగ్గర వాపోయారు. ఆయన వెంట తహసీల్దారు వెంకటేశ్వరరావు తదితరులున్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఆర్డీఓ తగిన న్యాయం చేస్తామని దుండగులపై చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు.

టిడ్కో లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించండి


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామారావు

సామర్లకోట: టిడ్కో లబ్ధిదారుల సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు సూచించారు. గురువారం స్థానిక కమిషనర్ చాంబర్‌లో సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. సచివాలయాల వారీగా టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల వివరాలను సేకరించారు. లబ్ధిదారులు తమ వాటా సొమ్ము చెల్లించే విధంగా చూడాలన్నారు. సొమ్ము చెల్లించడానికి ఇష్టంలేని వారి నుంచి తమకు టిడ్కో ఇళ్లు అవసరం లేదని నోటరీ అఫిడవిట్ తీసుకోవాలని సూచించారు. అదే విధంగా ఇప్పటికే లబ్ధిదారులు చనిపోతే వారి వారసులకు సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకోవాలన్నారు. పట్టణంలో టిడ్కో ఇళ్ల కోసం డిపాజిట్లు చెల్లించిన వారు 30 మంది వరకూ ఉన్నారని, ప్రాధాన్య క్రమంలో రద్దయిన ఇళ్లను వారికి కేటాయిస్తామని కమిషనర్ తెలిపారు. బ్యాంకుల నుంచి లబ్ధిదారులకు రుణాలు అందే విధంగా మెప్మా సిబ్బంది చూడాలన్నారు. ఈ నెలాఖరు లోపు టిడ్కో సమస్యలు పరిష్కరించి జనవరికి లబ్ధిదారులకు ఇళ్లు అందజేయడానికి సిద్ధం కావాలన్నారు. సమావేశంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత, మున్సిపల్ మేనేజర్ అచ్చుతరావు తదితరులు పాల్గొన్నారు.